

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడలో ప్రైవేట్ పాఠశాల బస్సును అడ్డుకొని నిరసన తెలుపుతున్న స్థానికులు, విద్యార్థులు

## ప్రైవేట్ బడి వద్దంటూ ఆందోళన

### జొన్నలబొగుడలో విద్యార్థుల ధర్నా

పెద్దకొత్తపల్లి, జూన్ 18 : 'ప్రైవేటు బడులు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు' అంటూ విద్యార్థులు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడలో నిరసనకు దిగారు. గ్రామంలోకి వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సులను అడ్డుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి గంటసేపు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రభుత్వాలు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని, ఈ క్రమంలో యాజమాన్యాలు అధిక ఫీజులు దండుకుంటున్నాయని వాపోయారు. ఇప్పటికైనా విద్యార్థులను సర్కారు పాఠశాలలకే పంపించాలని కోరారు.

## త్వరలో పూర్తిస్థాయిలో 'విద్యా సమీక్ష కేంద్రం'

### పాఠశాల విద్యాశాఖ నూతన డైరెక్టర్ నవీన్ నికోలస్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను(విద్యా సమీక్ష కేంద్రం) త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని పాఠశాల విద్యాశాఖ నూతన డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తాను కేంద్ర విద్యాశాఖలో పనిచేసే సమయంలోనే విద్యా సమీక్ష కేంద్రాలకు రూపకల్పన చేశామని, గుజరాత్‌లో తాము ఏర్పాటుచేసిన కేంద్రానికి ప్రధానమంత్రి అవార్డు వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏర్పాటైన విద్యా సమీక్ష కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మొత్తం మూడు దశలుండగా, ఇప్పటికే రెండు దశలు పూర్తయినట్టు అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖకు సంబంధించిన వెబ్‌సైట్లు, యాప్‌లతో ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అనుసంధానించాల్సి ఉన్నట్టు వెల్లడించారు.

## నల్సార్-సీఎస్‌బీ మధ్య ఎంఓయూ

### సైబర్ చట్టాల అమలులో కీలక ముందడుగు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలను అరికట్టే క్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో కీలక ముందడుగు వేసింది. తెలంగాణలో సైబర్ చట్టాన్ని బలోపేతం చేయడానికి నల్సార్‌వర్సిటీ ఆఫ్ లాతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ కీలక ఎంఓయూకి సంబంధించి సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్, నల్సార్‌వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు డీజీపీ జితేందర్ సమక్షంలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో సైబర్ చట్టాలు, ముఖ్యంగా ఐటీ చట్టాన్ని సమీక్షించి.. అమలులో ఉన్న లోపాలను గుర్తించి వాటి నవీకరణకు సూచనలు చేస్తారని పేర్కొన్నారు. డేటా గోప్యత, ఆర్థిక మోసాలు, డిజిటల్ సాక్ష్యాలు మొదలైన అంశాలపై న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై పలు నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. అలాగే సైబర్ బాధితులకు పరిహారం, డిజిటల్ వివాదాల పరిష్కారాలకు రూపకల్పన, పోలీస్, న్యాయ అధికారులకు ప్రత్యేక శిక్షణ, సీఎస్‌బీలో న్యాయ, ఫోరెన్సిక్ సలహా విభాగాన్ని స్థాపించడం, ఏఐ తదితర వాటిపై రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. నల్సార్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా న్యాయశాస్త్రం, పరిశోధన, విద్య ద్వారా సైబర్ నేరాలు తగ్గించి.. సమాజానికి సేవచేసే అవకాశం లభించిందని అన్నారు.

## కెన్సాస్, ఉద్యాన వర్సిటీల మధ్య అవగాహన

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యాన విద్యార్థుల నైపుణ్య శిక్షణ పెంపుదల, ఉద్యాన పరిశోధనల కోసం అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరస్పర మార్పిడి, సంయుక్త పరిశోధన కోసం తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, అమెరికాలోని కెన్సాస్ స్టేట్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ములుగులోని ఉద్యాన వర్సిటీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వీసీ రాజిరెడ్డి, కన్సాస్ స్టేట్ యూనివర్సిటీ డైరెక్టర్ వరప్రసాద్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ రైతుల ఆవిష్కరణలకు బీజం పడిందని, రాష్ట్రంలో ఉద్యాన రంగ ప్రమాణాలు పెంచేలా విశ్వవిద్యాలయం ముందుకెళ్తుందని వర్సిటీ వీసీ రాజిరెడ్డి తెలిపారు. వరప్రసాద్ మాట్లాడుతూ.. సేఫ్టీఫుడ్, బయోసేఫ్టీ, క్రిస్పర్ కాస్-9 వంటి ఆధునిక పరిశోధనలను ఉద్యాన పంటలపై ప్రయోగించి ఉత్తమ ఫలితాలు పొందవచ్చని తెలిపారు. అలాగే తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీలు తమ మధ్య సత్సంబంధాలను 12 ఏండ్ల తర్వాత బుధవారం తిరిగి పునరుద్ధరించుకున్నాయి. కాన్సస్ వర్సిటీ డైరెక్టర్ వరప్రసాద్, పీజేటీఏయూ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఈ మేరకు వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అగ్రి బయోటెక్ ఫౌండేషన్ చైర్మన్ సురవరం రఘువర్ధన్‌రెడ్డి, వర్సిటీ డీన్ చీనానాయక్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ పోతరాజు ప్రశాంత్, వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విద్యాసాగర్, సుధాకర్‌రెడ్డి, పిడిగం సైదయ్య, ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల్లో డిప్యూటేషన్లు రద్దు

## ఎన్‌ఎంసీ నోటీసుల ఎఫెక్ట్ • ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతుల లేమిపై జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ) అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. వైద్య కళాశాలల్లో డిప్యూటేషన్లు రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 38 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల డిప్యూటేషన్ రద్దు చేశారు. డిప్యుటేషన్లు రద్దయిన మెడికల్ కాలేజీల్లో ఆదిలాబాద్ రిమ్స్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల, సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల, హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్‌లు ఉన్నాయి. డిప్యుటేషన్లు రద్దయిన వారంతా వెంటనే తమ పాత స్థానాల్లో రిపోర్టు చేయాలని డీఎంఈ ఆదేశాలు జారీచేశారు. వీరితో పాటు మరో 20 మంది వరకు నాన్ టీచింగ్ స్టాఫ్ డిప్యుటేషన్లు సైతం రద్దు చేసినట్టు తెలిసింది.



### త్వరగా ఫ్యాకల్టీని నియమించుకోవాలి..

ఢిల్లీలో బుధవారం ఎన్‌ఎంసీ అధికారుల విచారణకు రాష్ట్ర హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ హాజరయ్యారు. మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ, వసతులపై హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఇచ్చిన సమాచారంతో ఎన్‌ఎంసీ అధికారులు సంతృప్తి చెందినట్టు వైద్యారోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒకేసారి పెద్ద సంఖ్యలో కాలేజీలు ఏర్పాటుకావడం వల్ల ఫ్యాకల్టీ కొరత, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు ఏర్పడ్డాయని అధికారులు ఎన్‌ఎంసీకి వివరించారు. వీలైనంత త్వరగా ఫ్యాకల్టీని నియమించుకోవాలని, వసతులను మెరుగుపర్చుకోవాలని ఎన్‌ఎంసీ ఈ సందర్భంగా అధికారులకు సూచించింది. కాలేజీల పర్మిషన్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సీట్ల కోత వంటి ఆలోచనే లేదని ఎన్‌ఎంసీ స్పష్టం చేసినట్టు అధికారులు తెలిపారు.

### వైసీపీ నేత భార్యకు రద్దు కానీ డిప్యుటేషన్

వైద్యారోగ్య శాఖ రద్దుచేసిన డిప్యుటేషన్లలో వైసీపీకి చెందిన ఏపీ కీలక నేత భార్య పేరు లేకపోవడం చర్చనీయాంశమైంది. సదరు డాక్టర్ పోస్టింగ్ జనగాం కాగా ఆమె ఉస్మానియా దవాఖానలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె డిప్యుటేషన్ రద్దు కాకపోవడంపై డీఎంఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆ నేత ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా కూడా పనిచేశారు.

## 21న ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సందేహాలను తీర్చేందుకు ఈ నెల 21న కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సును ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. ఈ సదస్సుకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా హాజరుకావచ్చు. సదస్సులో ఎప్‌సెట్ అడ్మిషన్ల ప్రక్రియ, బ్రాంచి, కాలేజీ సెలక్షన్, కోర్ బ్రాంచీల ప్రాముఖ్యత, ఉద్యోగావకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

## పెన్షనర్ల పెండింగ్ డీఏలు చెల్లించాలి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పెన్షనర్ల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పెన్షనర్ల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ నివేదిక తెప్పించుకొని మెరుగైన ఫిట్‌మెంట్ ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్‌ను అమలుచేయాలని కోరారు.



కడుపునిండా బువ్వ పెట్టలేరు!

- ప్రభుత్వ పాఠశాలల్లో మారని విద్యార్థుల ఆకలికేకలు
- 42శాతం ప్రభుత్వ బడుల్లో సురక్షిత నీరు కూడా కరువు
- మధ్యాహ్న భోజన పథకం అమలులో అనేక లోపాలు
- ఆందోళన వ్యక్తం చేసిన సోషల్ ఆడిట్ నివేదిక

మధ్యాహ్న భోజనం-సోషల్ ఆడిట్ ముఖ్యాంశాలు

## 'కడుపునిండా బువ్వపెట్టలేరు'పై స్పందించిన హెచ్‌ఆర్సీ

### సుమోటోగా విచారణకు స్వీకరించిన కమిషన్

### జూలై 28లోగా నివేదిక సమర్పించాలని ఆదేశాలు

*హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన పథకం లోపాలపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్సీ)స్పందించింది. నమస్తే తెలంగాణలో మెయిన్‌లో బుధవారం 'కడుపునిండా బువ్వపెట్టలేరు' శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై జూలై 28లోగా నివేదికను సమర్పించాలని విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలుకావడంలేదని ఇటీవలే విడుదలైన మధ్యాహ్న భోజన పథకం సోషల్ ఆడిట్ నివేదిక-2024 వెల్లడించింది. 18 శాతం స్కూళ్లలో పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టడంలేదని ఈ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. పలు పాఠశాలల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వడంలేదని, సర్కారు బడుల్లో సురక్షిత తాగునీరు కరువైందని కథనాన్ని ప్రచురించింది.*

## ఉద్యోగ వీసా కేసులో మరో మహిళ అరెస్టు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): దక్షిణాది రాష్ట్రాల్లో సుమారు 100మందికికి పైగా బాధితులను మోసగించిన ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ ఉద్యోగ వీసా కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరు, ఆ సంస్థ డైరెక్టర్ అయిన సరోజ్ శశ్వంత్ థోరట్ (ఏ8)ను సీఐడీ పోలీసులు అరెస్టు చేసినట్టు ఏడీజీ చారుసిన్హా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో కరీంనగర్‌కు చెందిన కమలాకర్‌కు మాల్టాలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి.. రూ. 8లక్షల వరకు వసూలు చేశారు. ఆ తర్వాత ఆ సంస్థ నకిలీ డాక్యుమెంట్లు సమర్పించడంతో అతనితోపాటు మరి కొందరికి ఉద్యోగాలు రాలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసును సీఐడీకి బదిలీ చేశారు. దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ నిరుడు ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా, తాజాగా సరోజ్‌ను అరెస్టు చేసినట్టు పోలీసు సీఐడీ అధికారులు పేర్కొన్నారు.

## పంచాయతీ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పంచాయతీ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్ (టీఎస్‌పీఎస్‌ఏ) కోరింది.

## దక్షిణాది రాష్ట్రాలకు 116కోట్ల సబ్సిడీ విడుదల

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పీఎంఈజీపీ (ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకం కింద బుధవారం కేవీఐసీ (ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్) దేశవ్యాప్తంగా 11,480 సేవారంగ లబ్ధిదారులకు రూ.300 కోట్లకుపైగా మార్జిన్ మనీ సబ్సిడీని విడుదల చేసింది. మొత్తం రూ.906కోట్ల రుణాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ఈ సబ్సిడీని విడుదల చేసింది. దీనిలోభాగంగా దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరిలలో 4565 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 343కోట్ల రుణాలకుగాను రూ.116 కోట్ల సబ్సిడీని ఢిల్లీలోని రాజ్‌ఘాట్ కార్యాలయంలో కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్ విడుదల చేశారు. ఈ పథకంలో భాగంగా మొత్తం 10,18,185 సూక్ష్మ వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేయగా, కేంద్ర ప్రభుత్వం రూ.73,348 కోట్ల రుణాలను మంజూరు చేయడం జరిగింది. దీనికిగాను రూ.27,166 కోట్లకు పైగా మార్జిన్ మనీ సబ్సిడీని లబ్ధిదారులకు అందించారు. అలాగే, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 90,04,541 మంది ఈ పథకం ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధిని పొందినట్టు అధికారులు తెలిపడం జరిగింది.

# ఈసారికి పాత ఫీజులే!

### ఇంజనీరింగ్ ఫీజుల సవరణకు బ్రేక్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల ఫీజుల సవర+ మళ్లీ మొదటికొచ్చింది. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) కసరత్తుకు సర్కారు బ్రేకులు వేసింది. దీంతో ఈ ఏడాది ఫీజుల పెంపు లేనట్టేనని తేలిపోయింది. ఈ విద్యాసంవత్సరంలో పాత ఫీజులే ఉండనున్నాయి. జూలైలో కౌన్సెలింగ్ ప్రారంభం కానుండగా, పాత ఫీజుల ప్రకారమే సీట్లను భర్తీచేయనున్నారు.

### సబ్ కమిటీతో అధ్యయనం

టీఏఎఫ్‌ఆర్సీ ప్రతిపాదిత ఫీజులపై సమగ్ర అధ్యయనం చేయాలని బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకుంది. సబ్ కమిటీ ఏర్పాటు బాధ్యతలను తెలంగాణ ఉన్నత విద్యామండలికి అప్పగించారు. ఫీజుల ఖరారు కోసం బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో టీఏఎఫ్‌ఆర్సీ సమావేశమైంది. చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఫీజుల సవరణపై ఈ సమావేశంలో చర్చించారు. టీఏఎఫ్‌ఆర్సీ ఇప్పటికే పలు కాలేజీల ఫీజులను ఖరారు చేయగా, కొన్ని కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరిగాయి. అయితే ఆయా ఫీజుల సవరణపై మరోమారు అధ్యయనం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యాకోర్సుల ఫీజుల సవరణకు ప్రస్తుతానికి బ్రేకులు పడినట్టేనని చెప్తున్నారు.

### భారం భరించలేకే?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. ఇప్పటికే దాదాపు రూ. 8 వేల కోట్ల బకాయిలున్నాయి. ఈ బకాయిలను చెల్లించలేక సర్కారు సతమతమవుతున్నది. వీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి. పాత ఫీజుల ప్రకారమైతే సర్కారుపై ఏటా రూ. 2,400 కోట్ల భారం పడుతున్నది. ప్రతిపాదిత ఫీజులతో సుమారుగా రూ. 500-800కోట్ల వరకు భారం పడే అవకాశమున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఉన్న రూ. 8 వేల కోట్లకు తోడు కొత్తగా పెరిగేవి కలుపుకొంటే సర్కారుపై ఏటా మూడు వేల కోట్ల భారం పడుతుంది. ఒకసారి పెంచితే మూడేండ్ల పాటు ఈ భారాన్ని భరించాల్సిందే. మూడేండ్ల తర్వాత మళ్లీ ఈ ఫీజులను బట్టే కొత్త ఫీజులను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే బకాయిలు చెల్లించలేక సర్కారు సతమతమవుతుండగా, కొత్త ఫీజులతో సమస్యలు తప్పవని భావించి కాలయాపనకు ఈ ప్రయత్నాలు చేస్తున్నట్టు కాలేజీల యాజమాన్యాలు అనుమానిస్తున్నాయి.








